క్లుప్తంగా

ఆలయానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి జూలూరుపాడు మండలం కాకర్లకు చెందిన ఉడత శ్రీనివాస్, రూపశ్రీ దంపతులు రూ.50,116 పాల్వంచ కేటీపీఎస్‌కు చెందిన చెరుకు అశోక్ దంపతులు రూ.10,116 అందజేసినట్లు ఆలయ ఈఓ జి.సుదర్శన్ ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సాబీర్‌పాషా, రజాక్

సింగరేణి(కొత్తగూడెం): క్రీడలు మానసికోల్లాసానికి శరీర దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రుద్రంపూర్ ఏరియాలోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో చాలెంజర్స్ కప్ 2024 క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ చేకూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి నోటిఫికేషన్‌ను రీషెడ్యూల్ చేయాలి

ఇల్లెందు: సింగరేణి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పారదర్శకత లోపించిందని యంగ్ ఇండియా యూత్ అసోసియేషన్ ఫౌండర్ ప్రసిడెంట్ సిలివేరు ఉమా శంకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... ఒకేసారి 360 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు విడుదల చేయటం వల్ల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందన్నారు. దీనివల్ల తరువాత టర్మ్‌లో అర్హత పొందిన కార్మికులకు ఎక్కువ సంఖ్యలో పోస్టులు ఉండవని తెలిపారు. దీనివల్ల తరువాత ఉద్యోగాలు పొందే కార్మికులకు నష్టం జరుగుతుందని, అందరికీ సమాన వాటా లభించాలని సూచించారు. నోటిఫికేషన్ మీద పునఃపరిశీలన చేయాలని కోరారు.

తత్కాల్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అర్హత ఉండి, ఇంకా పరీక్ష ఫీజు చెల్లించని అభ్యర్థులకు తత్కాల్ స్కీమ్ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సెంటర్ల కోఆర్డినేటర్లను సంప్రదించి తత్కాల్ స్కీమ్ ద్వారా సాధారణ పరీక్ష ఫీజుతో పాటు అదనంగా పదో తరగతికి రూ.500, ఇంటర్మీడియట్‌కు రూ.1000 చొప్పున మీ సేవా కేంద్రాలలో 18 నుంచి 21వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు 93వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు భూక్యా శ్యామ్, పీవైఎల్ నాయకుడు భూక్యా తారాచంద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పోలారం గ్రామ పంచాయతీలో ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులు దేశ స్వాతంత్య్రం కోసం తమ విలువైన ప్రాణాలను భారత జాతికి అంకితం చేశారని గుర్తుచేశారు. వారు అందించిన స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారం, విద్య, ఉపాధి రంగాల అభివృద్ధికి ఉద్యమించాలని కోరారు. నేటి పాలకులు కులం, మతం పేర్లతో ఓట్లను దండుకొని కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. వారి చర్యలను ఎండగట్టి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో మంగీలాల్, రాజీవ్, సంతోష్, రవి, సుమన్, రమేష్, లక్ష్మణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ గోడౌన్‌కు స్థలం కరువు

- నాలుగు దశాబ్దాలుగా అద్దె రేకుల షెడ్లలోనే నిర్వహణ
- ప్రభుత్వ స్థలం కేటాయిస్తే భవనం నిర్మిస్తామంటున్న అధికారులు
- అప్పటికే శిథిలావస్థకు చేరిన హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం, గోడౌన్లు



శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్‌లో నడుస్తున్న హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం

పాల్వంచ: పాల్వంచ పట్టణం, మండల ప్రాంత ప్రజలకు తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో వంట గ్యాస్ సరఫరా చేసే హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయ నిర్వహణ భారంగా మారింది. నాలుగు దశాబ్దాల నుంచి నవభారత్ వద్ద ఎన్‌ఎండీసీ సంస్థ పరిధిలో రేకుల షెడ్లలో కార్యాలయం, గోడౌన్లు నడుస్తున్నాయి.

ప్రభుత్వ స్థలం కేటాయిస్తే పక్కా భవన నిర్మాణం చేసుకుంటామని అధికారులు అనేక మార్లు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటున్నా ఇప్పటికీ స్థలం చూపించకపోవడంతో అక్కడి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

శిథిలాస్థకు చేరిన కార్యాలయం, గోడౌన్..

హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ కింద 27,354 వినియోగదారులు ఉన్నారు. నిత్యం ఇక్కడ నుంచి 12 ఆటోల ద్వారా వంటగ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతుంటాయి. నెలవారీగా కనీసం 10,800 సిలిండర్లు డెలివరీ అవుతుంటాయి. గోడౌన్‌లలో నిత్యం 2000 సిలిండర్లు స్టాక్ ఉంటాయి. అయితే ఎన్‌ఎండీసీ సంస్థ నుంచి అద్దెకు తీసుకున్న గదిలో కార్యాలయం, గోడౌన్ 1988 నుంచి నడుస్తోంది. ప్రతీ వర్షాకాలంలో ఈ రేకుల షెడ్లు కురుస్తూ కార్యాలయం మొత్తం జలమయంగా మారుతుంది. దీంతో అక్కడ పనిచేసే మేనేజర్, కార్యాలయ సిబ్బందికి, స్టాక్ పాయింట్ నేడు శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉంది.

ఎకరం స్థలం కేటాయిస్తే



కురుస్తున్న రేకుల షెడ్డు (ఫైల్)

భవన నిర్మాణానికి నిధులు...

హైవే రోడ్‌పై ప్రభుత్వం నుంచి ఎకరం స్థలం కేటాయిస్తే పెట్రోల్ బంక్ నిర్మాణంతో పాటు మండల స్థాయి స్టాక్ పాయింట్, ఎల్‌పీజీ సెంటర్ నిర్మాణం చేసుకుంటామని పలుమార్లు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలకు వినతిపత్రాలు సమర్పించారు. పౌరసరఫరాల సంస్థ నుంచి భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని అధికారులు వాపోతున్నారు. వినియోగదారుల సౌకర్యంతో పాటు, స్టాక్ పాయింట్‌ను పట్టణానికి కొంచెం దూరంలో ఉంచడం ఎంతో మేలని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతున్నారు.

స్థలం కేటాయించాలని కోరాం..



సొంత స్థలం లేక ఎన్‌ఎండీసీ సంస్థ పరిధిలో ఉన్న రేకుల షెడ్లలో స్టాక్ పాయింట్ నడుస్తోంది. వర్షాకాలంలో కార్యాలయం మొత్తం కురుస్తోంది. ఎండాకాలం కూడా ఇబ్బందిగా ఉంటుంది. ప్రభుత్వం స్థలం ఇస్తే పక్కా భవనానికి కార్పొరేషన్ నుంచి నిధులు మంజూరవుతాయి. పక్కనే కొత్తగూడెంలో సొంత స్థలంలోనే ఉన్నాయి. అదే మాదిరిగా ఇక్కడ కూడా ఇవ్వాలని కలెక్టర్, ఆర్డీఓలకు పలుమార్లు విజ్ఞప్తిని చేశాం.

– అనంతుల లక్ష్మీనారాయణ, హెచ్‌పీ గ్యాస్ మేనేజర్, పాల్వంచ

షాదీఖానాను అందుబాటులోకి తెస్తాం..



నయీమ్ ఖురేషిని అభినందిస్తున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం షాదీఖానా ఉర్దూఘర్ యాజమాన్య, నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా నయీమ్ ఖురేషి ఇటీవల ఎన్నికయ్యారు. బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులను ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అభినందించారు. మాట్లాడుతూ... గత పాలకవర్గం నిర్లక్ష్యం మూలంగా ఉర్దూఘర్, షాదీఖానా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, పేద కుటుంబాలు శుభకార్యాలు జరుపుకునేందుకు అందుబాటులో ఉన్న షాదీఖానా అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోందని దీన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పేద కుటుంబాలకు అందుబాటులో తేవాల్సిన బాధ్యత నూతన కమిటీపై ఉందన్నారు. జిల్లా కేంద్రానికి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. నయీమ్ ఖురేషి మాట్లాడుతూ... షాదీఖానా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సహకమిటీ నాయకుల సహకారంతో షాదీఖానాలో అన్ని సౌకర్యాలు కల్పించి పేదలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తానని తెలిపారు. శుభకార్యాలు జరుపుకునేందుకు కులమతాలకు అతీతంగా షాదీఖానాను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహీమూద్, అహమ్మద్, మహమ్మద్, షరీఫ్, అబ్దుల్, ముఖీద్ సాటీ, హమీద్, రిస్కిన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని రక్షించాలి



మాట్లాడుతున్న మద్దెల శివకుమార్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు వద్ద ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం చుట్టూ వివిధ రకాల ఫ్లెక్సీలు కట్టి విగ్రహం కనపడకుండా చేస్తున్నారని, కొంత మంది విగ్రహం వెనుక భాగంలో మూత్ర విసర్జన చేస్తున్నారని అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు మద్దెల శివకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందాహనుమంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయనతోపాటు సంఘం నాయకులు అక్కడి వెళ్లి అంబేద్కర్ విగ్రహం దగ్గర పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహం కనిపించకుండా ఇష్టం వచ్చినట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చెత్తచెదారం విగ్రహం చుట్టుపక్కల వేస్తున్నారన్నారు. విగ్రహం చుట్టూ ఫెన్సింగ్ వేసి పరిశుభ్రంగా ఉంచేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందా వెంకన్న, లాజరస్, అపరబాలు అల్లి శంకర్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జుబేదా బేగం


సుజాతనగర్: సైబర్ నేరాలపై మండల కేంద్రంలో ఆదివారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ జుబేదా బేగం మాట్లాడుతూ... సైబర్‌నేరాలపై ప్రతీఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. మొబైల్‌కు వచ్చిన లింక్‌లు నొక్కితే, నగదు మాయం అవుతుందని, అటువంటి వాటిపై జాగ్రతలు పాటించాలన్నారు. దూరప్రాంతాల నుంచి ఫోన్ చేసి ఓటీపీలు చెప్పమంటే స్పందించవద్దన్నారు. ఆధార్‌కార్డు నంబర్, పాన్ కార్డు నంబర్ వివరాలను ఎట్టి పరిస్థితులలో చెప్పకూడదన్నారు.

వాహన తనిఖీలు...

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు ఆదివారం సుజాతనగర్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ జుబేదా బేగం మాట్లాడుతూ...

ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. రూ.50 వేల మించి నగదు ఎట్టిపరిస్థితులోనూ తీసుకెళ్లరాదన్నారు. చీరలు, ఇతర వస్తువులు తీసుక్తే తగిన ఆధారాలు ఉండాలని సూచించారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి



మాట్లాడుతున్న చావా రవి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులకు సాధారణ టెట్ కాకుండా, ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని తెలంగాణ రాష్ట్రం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కొత్తగూడెంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్ సింగ్ అధ్యక్షతన జరిగింది. రవి మాట్లాడుతూ...రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులు టెట్ లేని కారణంగా ఆగిపోయాయని, ఇన్ సర్వీస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సాధారణ టెట్ రాయడం వయస్సు రీత్యా ఇబ్బందులు ఉన్న పరిస్థితుల్లో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి ప్రమోషన్ ద్వారా అర్హత కలిగిన పోస్టులలో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధ్యాయ ప్రమోషన్లు లేక అనేక స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దీనివల్ల విద్యారంగం తీవ్రంగా నష్టపోతోందని దీన్ని నివారించేందుకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలని, ట్రెజరీలలో పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ, ఉపాధ్యక్షులు వి.వరలక్ష్మి, బి.మురళీమోహన్, కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, జయరాజు, టి.శ్రీనివాస్, ఎం.కృష్ణారావు, ఆర్.రమేష్‌కుమార్, బి.రాము, ఎస్.విజయ్‌కుమార్, కే.గంగాధర్, ఎం.రాజయ్య, ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

పాల్వంచరూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు లేకుండానే స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు ప్రజావేదికను ఇన్‌హౌజ్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఇల్లెందు: సార్వత్రిక ఎన్నికల నిబంధనలు అమలులోకి వచ్చినందున ఎవరైనా పెద్ద మొత్తంలో డబ్బు తీసుకెళ్తున్నా, మద్యం నిల్వలు చేసినట్లయితే గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.రవికుమార్ హెచ్చరించారు. ఆదివారం మాట్లాడుతూ... ఇల్లెందు నియోజకవర్గంలో చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

కారును ఢీకొట్టిన ట్యాంకర్

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి వద్ద కారును బూడిద ట్యాంకర్ ఢీకొట్టిన ప్రమాదంలో కారు వెనుకభాగం దెబ్బతిన్నది. పోలీసులు తెలిపిన వివరాలు... పెద్దమ్మగుడి వద్ద రహదారిపై ఆదివారం భద్రాచలం వెళ్తున్న కారుకు ఎదురుగా కుక్క అడ్డు రావడంతో డ్రైవర్ బ్రేక్ వేశాడు. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన యాష్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనక డిక్కి దెబ్బతిన్నదని కారు యాజమాని మిట్టపల్లి దీలిప్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ప్రమాదానికి కారణమైన అశ్వారావుపేటకు చెందిన యాష్ ట్యాంకర్ డ్రైవర్ షేక్ ఉమర్‌పాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అభివృద్ధికి నిధులివ్వండి



ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న స్రవంతి

ఇల్లెందురూరల్: సింగరేణి సంస్థ ఆవిర్భావ కాలంలో నాటి గ్రామమైన తిలక్‌నగర్ నేటికీ అనేక సమస్యలతో కునారిల్లుతోందని, నిధుల కేటాయింపులో ప్రాధాన్యమిచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్యకు తిలక్‌నగర్ మాజీ సర్పంచ్ ధనసరి స్రవంతి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ఇంత కాలం తిలక్‌నగర్ గ్రామపంచాయతీలో అత్యధిక భూభాగం సింగరేణి లీజు పరిధిలో ఉండటంతో కనీసం రోడ్లు కూడా వేయనీయలేదని, దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు ప్రస్తుతం నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్నాయని వాపోయారు. సింగరేణి పాత క్వార్టర్లలో నివాసం ఉంటున్న ప్రజలు ఇండస్ట్రియల్ విద్యుత్ వినియోగించడం వల్ల కరెంటు బిల్లుతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. ఆయా గృహాలకు గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థకు చేరిన క్వార్టర్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజు, ఎట్టి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అధికారుల నిర్లక్ష్యం

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం ఫలితంగా ఉద్యోగులు నిర్వహించాల్సిన విధుల్లో ప్రైవేట్ వ్యక్తులు విధులు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. పెద్దమ్మగుడి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో ఆలయ సిబ్బంది మాత్రమే ప్రత్యేక కౌంటర్ వద్ద విధులు నిర్వహించాల్సి ఉండగా ఆదివారం లక్ష్మి అనే సేవకురాలైన ప్రైవేట్ మహిళ ప్రతీవారం విధులు నిర్వహించడమే కాకుండా భక్తుల నుంచి టికెట్ డబ్బులు కూడా వసూలు చేస్తున్నట్లు పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఈఓ జి.సుదర్శన్‌ను వివరణ కోరగా... ఆలయంలో ప్రైవేట్ వ్యక్తులు విధులు నిర్వహిస్తున్నట్లు తనకు సమాచారం లేదు. ప్రత్యేక కౌంటర్‌లో ఆలయ సిబ్బంది మాత్రమే విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అలాంటిది జరిగితే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉద్యమకారులకు 'సంక్షేమం' అందించాలి



మాట్లాడుతున్న శాంతిరామ్

కొత్తగూడెంఅర్బన్: 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శాంతిరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1969 ప్రత్యేక తెలంగాణ సమరయోధులకు జారీ చేసిన గుర్తింపు కార్డులలో కొన్ని అవకతవకలు జరిగాయని, వాటిని రద్దు చేయాలన్నారు. అప్పటి ఎఫ్ఆర్ఐ కాపీలు, అరెస్టు వారెంట్లు, జైలు రివార్డులు, పత్రికా ప్రకటనలు ఎలాంటి ఆధారాలు లభ్యం కావడం లేదన్నారు. ప్రభుత్వం చొరవ చూపి ఒక కమిటీని నియమించి వారిని గుర్తించాలని కోరారు. సత్యనారాయణరాజు, అనంతారెడ్డి, కృష్ణ, కృష్ణార్జునరావు, కేశవరావు, చింతలచెర్వు గెర్షోము, రామారావు, బలరాంసింగ్, మల్లేష్, సత్తార్, వెంకటరామారావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి ఎన్నిక



నాగేశ్వరరావును అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఇల్లెందు: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా పొద్దుటూరు నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం కళాసీ బస్తీలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ సత్రంలో జరిగిన ఎన్నికల్లో 517 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పొద్దుటూరు నాగేశ్వరరావుకు 289 ఓట్లు రాగా గౌరిశెట్టి కృష్ణకు 228 ఓట్లు లభించాయి. 61 ఓట్ల మెజార్టీతో నాగేశ్వరరావు గెలుపొందారు. ఈ సందర్భంగా మండల, పట్టణ ఆర్య వైశ్య సంఘం సభ్యులు, ప్రముఖులు ఘనంగా అభినందించారు. కొంతకాలంగా మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నిక వివాదాస్పదంగా మారింది. సాధారణ ఎన్నికలు తలపించేలా ఇరు ప్యానెళ్లు ప్రచారం చేసుకుని ఓటింగ్ నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఓటింగ్, మధ్యాహ్న 3 గంటలకు కౌంటింగ్ జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసుల తగు సూచనలు చేశారు. అధ్యక్షుడిగా విజయం సాధించిన నాగేశ్వరరావును ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు డానియేల్ అభినందించారు.

ఏఐటీయూసీకి 'గుర్తింపు' ఏది?

సింగరేణి(కొత్తగూడెం): గత డిసెంబర్ 27న సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి మూడు నెలలైనా విజయం సాధించిన ఏఐటీయూసీకి గుర్తింపు పత్రం అందలేదు. అయితే ఎన్నికలు జరిగాయి కానీ, కోడ్ ఆఫ్ డిసిప్లేన్ ప్రకారంగా 7వ సారి జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికలు రెండేళ్ల కాలపరిమితితో జరిగినప్పటికీ కార్మికులను తప్పుదోవ పట్టించడానికి జరిగిన ఎన్నికలు నాలుగు సంవత్సరాల కాల పరిమితితో జరిగాయని కొంతమంది నాయకులు ప్రచారం చేస్తున్నారనే గుసగులు వినపడుతున్నాయి. అయితే కార్మికులు ఎన్నికల్లో ఓట్లు వేశారు కానీ, అవి రెండేళ్ల కాలపరిమితా.. లేక నాలుగేళ్లా అని చాలామంది కార్మికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. సింగరేణిలో ఇప్పటి వరకు ఏడుసార్లు గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. అయితే ఒక్కసారి తప్ప, మిగిలిన అన్నిసార్లు ఒకటి, రెండు సంవత్సరాలు ఆలస్యంగా జరిగాయి. దీన్ని బట్టి చూస్తే కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌తో గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితితో సంబంధం లేదని, గెలిచిన సంఘం వారికి ఇష్టం వచ్చినప్పుడే ఎన్నికలు పెట్టుకోవచ్చని, దీన్ని కేంద్ర కార్మిక శాఖ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ యాజమాన్యం కొర్రీలు పెట్టి కాలయాపన చేసిందని కార్మికులు చర్చించుకుంటున్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు ప్రారంభం



సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులకు సూచనలు చేస్తున్న హెచ్‌ఎం ప్రభుదయాళ్

సింగరేణి(కొత్తగూడెం): పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు బాగా రాయాలని, పాఠశాలకు, జిల్లాకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభుదయాళ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈనెల 18 నుంచి పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆదివారం స్కూల్‌లో బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆహార నియమాలు పాటిస్తూ ధృడసంకల్పంతో పరీక్షలు రాయాలన్నారు. మీ భవిష్యత్ మీరు రాసే ప్రశ్నపత్రాలపై ఆధారపడి ఉంటుందని, అందరూ మంచి గ్రేడ్ సాధించాలని ఆకాంక్షించారు.

జూలూరుపాడు: సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) గుగులోతు వెంకట్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెంగన్నపాలెం సెయింట్ ఆంటోనియస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలో 326 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జూలూరుపాడు పరీక్ష కేంద్రంలో 170 మంది, వెంగన్నపాలెంలో 156 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష సమయం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతుందని, పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు 5 నిమిషాల ఆలస్యమైనా అనుమతించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, సీసీ కెమెరాలు, గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమ వెంట సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకరాకూడదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని నిర్వాహకులను ఆదేశించడం జరిగిందన్నారు.

పాల్వంచరూరల్: పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కిన్నెరసాని డ్యామ్‌సైడ్ పరీక్ష కేంద్రంలో మొత్తం 206 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకులు ఆదివారం తెలిపారు.

ఇల్లెందురూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి 776, ప్రైవేటు పాఠశాలల నుంచి 413 మంది విద్యార్థులు మొత్తం 1,189 మంది పరీక్షలకు హాజకానున్నారు. మండల, పట్టణంలో మెయిన్‌రోడ్డు హైస్కూల్, జేబీఎస్ హైస్కూల్, బాలికోన్నత పాఠశాల, సింగరేణి ఉన్నత పాఠశాల, సుదిమళ్ల గిరిజన గురుకుల పాఠశాల, చల్లసముద్రం, రొంపేడు మొత్తం ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో రొంపేడు, చల్లసముద్రం కేంద్రాలను సీ సెంటర్లుగా ప్రకటించారు. ఆయా చోట్ల ప్రత్యేకంగా సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

టేకులపల్లి: నేటినుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. టేకులపల్లి మండలంలో టేకులపల్లి, బేతంపూడి, ముత్యాలంపాడు, బొమ్మనపల్లి, బోడు, కుంటల్ల ఉన్నత పాఠశాలలు, కోయగూడెం, గంగారం ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీ, జ్యోతిబా పూలే బాలుర, బాలికల పాఠశాలల నుంచి మొత్తం 442 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. టేకులపల్లి, బోడు, సులానగర్ మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటల లోపే చేరుకోవాలని పరీక్ష కేంద్రాల సీఎస్‌లు మెరుగు శ్రీనివాస్, దేవదాస్, రాంచందర్‌సింగ్ తెలిపారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గంటల నుండి రాత్రి 8-00 గంటల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లెందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148